# ఆకాశవాణి హైద్రాబాద్ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## జాతీయ వార్తలు

తేది : 22.05.2017 సమయం : 12:30 గంటలు

## ముఖ్యాంశాలు

1. కెనడా, పాకిస్థాన్ దేశాలతో సంబంధాలు కలిగి ఉన్న ఇద్దరు అనుమానిత ఉగ్రవాదులను సరిహద్దు భద్రతాదళం, పంజాబ్ పోలీసులు సంయుక్తంగా జరిపిన ఆపరేషన్‌లో అరెస్టు చేశారు.

2. జమ్ముకశ్మీర్‌లో హింసాత్మక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న అంశానికి సంబంధించి లష్కరే తోయిబా అధినేత హాఫీజ్ మొహమ్మద్ సయీద్, హురియత్ నాయకుడు సయ్యద్ అలీషా గిలానీల పాత్రపై విచారణ జరుపుతోన్న జాతీయ దర్యాప్తు సంస్థ నిన్న కశ్మీర్ వేర్పాటువాదులను రెండవరోజు కూడా ప్రశ్నించింది.

3. అత్యున్నత ఆధునిక వసతులతో కూడిన తేజాస్ ఎక్స్‌ప్రెస్ రైలును-రైల్వేశాఖ మంత్రి ప్రారంభించనున్నారు.

4. ఉత్తర కొరియా నిన్న జరిపిన బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి భద్రతామండలి రేపు అత్యవసర సమావేశం ఏర్పాటు చేయనుంది.

5. నేపాల్‌లో మొదటిదశ స్థానిక సంస్థల ఎన్నికల ఓట్ల లెక్కింపు దాదాపుగా పూర్తయింది. ఇప్పటి వరకు 9 శాతానికి పైగా ఫలితాలు ప్రకటించారు

--------------

కెనడా, పాకిస్థాన్ దేశాలతో సంబంధాలు కలిగిఉన్న ఇద్దరు అనుమానిత ఉగ్రవాదులను సరిహద్దు భద్రతాదళం, పంజాబ్ పోలీసులు సంయుక్తంగా జరిపిన ఆపరేషన్‌లో అరెస్ట్ చేశారు. ఇండో-పాకిస్థాన్ సరిహద్దు వద్ద పాకిస్థాన్ నుంచి వచ్చిన ఆయుధాలను వెతుకుతుండగా వీరిద్దరినీ అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు. గురుదాస్‌పూర్ జిల్లా శ్రీహర్‌గోబింద్‌పూర్‌కు చెందిన మాన్‌సింగ్, జలంధర్ జిల్లాలోని కర్తార్‌పైర్‌కు చెందిన షేర్‌సింగ్‌గా వీరిని గుర్తించారు.

------------

జమ్ముకశ్మీర్‌లో హింసాత్మక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న అంశానికి సంబంధించి లష్కరే తోయిబా అధినేత హాఫీజ్ మొహమ్మద్ సయీద్, హురియత్ నాయకుడు సయ్యద్ అలీషా గిలానీల పాత్రపై విచారణ జరుపుతోన్న జాతీయ దర్యాప్తు సంస్థ నిన్న కశ్మీర్ వేర్పాటువాదులను రెండవరోజు కూడా ప్రశ్నించింది. కశ్మీర్ లోయలో ఉగ్రవాదులకు హవాలా, ఇతర మార్గాల ద్వారా నిధుల సేకరణ, వసూలు, నిధుల బదిలీకి సంబంధించి దర్యాప్తు సంస్థ ఫరూక్ అహ్మద్‌దార్, జావెద్ అహ్మద్ బాబాలను ప్రశ్నించింది. పాకిస్తాన్ నుండి నిధులు లభిస్తున్నాయని టెలివిజన్ ఛానెల్‌లో వారు చెప్పిన నేపథ్యంలో దీనిపై వివరణ ఇవ్వాలని దర్యాప్తు సంస్థ వీరిని కోరింది. ఇటీవలి కాలంలో కశ్మీర్ లోయలో పాఠశాలలు, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసానికి సంబంధించి ఇప్పటి వరకు నమోదైన 13 కేసులలో అభియోగాలు మోపబడినవారి నుంచి కూడా దర్యాప్తు సంస్థ వివరాలు సేకరించింది.

------------

అత్యున్నత ఆధునిక వసతులతో కూడిన తేజాస్ ఎక్స్‌ప్రెస్ రైలును-రైల్వేశాఖ మంత్రి సురేష్ ప్రభు ప్రారంభించనున్నారు. ఈ రైలు ముంబైలో ఛత్రపతి శివాజీ నుండి గోవాలోని కర్మోలీ స్టేషన్ వరకు ప్రయాణిస్తుంది. వర్షాకాలంలో వారానికి 3 రోజులు, మిగతా రోజుల్లో వారానికి ఐదు రోజులు ఈ రైలు ప్రయాణిస్తుంది. దాదర్, థానే, పన్వేల్, రత్నగిరి, కుడాల్ స్టేషన్‌లలో ఈ రైలు ఆగుతుంది.

------------

ఉత్తర కొరియా నిన్న జరిపిన బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి భద్రతామండలి రేపు అత్యవసర సమావేశం ఏర్పాటు చేయనుంది. ఈ సమావేశం ఏర్పాటు

–చేయాలని అమెరికా, దక్షిణకొరియా, జపాన్ కోరినట్టు ఐక్యరాజ్యసమితి తెలిపింది. ఈ క్షిపణిని దక్షిణ ప్యాంగ్‌యుంగ్ నుండి ఐదు వందల కిలోమీటర్ల దూరం మేర ప్రయోగించినట్టు, చివరికి జపాన్ నదిలో పడిపోయినట్టు దక్షిణ కొరియా సైనికులు తెలిపారు. వారం రోజుల వ్యవధిలో ఇది  రెండవ ప్రయోగం కాగా– ఈ సంవత్సరం మొత్తం 10 క్షిపణులను ప్రయోగించారు. బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం విజయవంతమైందని ఉత్తర కొరియా పేర్కొంది.

------------

నేపాల్‌లో మొదటిదశ స్థానిక సంస్థల ఎన్నికల ఓట్ల లెక్కింపు దాదాపుగా పూర్తయింది. ఇప్పటి వరకు 9 శాతానికి పైగా ఫలితాలు ప్రకటించారు.  2వందల 81 స్థానిక సంస్థలకుగాను 270 స్థానిక సంస్థల  మేయర్లు, ఛైర్‌పర్సన్‌ల ఫలితాలు ప్రకటించారు. నేపాల్ కమ్యూనిస్ట్ పార్టీ–యూఎంఎల్ పెద్దపార్టీగా అవతరించింది. ఈ పార్టీ 114 స్థానాల్లో విజయం సాధించగా– 8స్థానాల్లో ముందంజలో ఉంది.  నేపాలీ కాంగ్రెస్ 103 స్థానాలు గెలుపొంది 3 స్థానాల్లో ముందంజలో ఉంది. నేపాల్ కమ్యూనిస్ట్‌పార్టీ మావోయిస్టు సెంటర్ 46 స్థానాల్లో విజయం సాధించింది.

------------

రాజస్తాన్‌లో కోటాలో బుధవారం నుంచి జరగనున్న గ్లోబల్ రాజస్తాన్ అగ్రిటెక్ మీట్ గ్రామ్ సమావేశాల సందర్భంగా ఆ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ నిపుణులు, రైతులతో వరుస సెమినార్లు నిర్వహించనుంది. ప్రారంభ సదస్సులో ప్రపంచ బ్యాంకులో సీనియర్ వ్యవసాయ ఆర్థికవేత్త ఎడ్వర్డ్ బ్రెస్నియాన్ నీటి వనరులశాఖమంత్రి రామ్ ప్రతాప్ పాల్గొంటారని హార్టీకల్చర్ విభాగం డైరెక్టర్ విజయ్‌పాల్‌సింగ్ తెలిపారు.

------------

హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం మత సంస్థల నిర్వహణ, ప్రార్ధనలు, పూజలు జరిపేందుకు సహాయ నిధులు కల్పించాలని నిర్ణయించింది. దేవుళ్లలోయగా ప్రసిద్ధిగాంచిన రాష్ట్రంలోని పేరొందిన మతపరమైన వారసత్వ సంస్థలను, కట్టడాలను పరిరక్షించే ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార ప్రతినిధి ఒక తెలిపారు.

------------

బెంగళూరు ఎఫ్‌సీ జట్టు ఫెడరేషన్ కప్, ఫుట్‌బాల్ కప్‌ను గెలుచుకుంది. కటక్‌లో గతరాత్రి జరిగిన ఫైనల్స్ పోటీలో డిఫెండింగ్ ఛాంపియన్స్, 14 పర్యాయాలు విజయం సాధించిన మోహన్‌బగాన్ జట్టును బెంగుళూరు ఎఫ్‌సీ జట్టు 2–0 స్కోరుతో ఓడించింది. ఈ విజయంతో బెంగుళూరు జట్టుకు వచ్చే సంవత్సరం జరిగే ఆసియాన్ ఫుట్‌బాల్ కాన్ఫెడరేషన్ కప్ పోటీలలో స్థానం లభించింది.

------------

బార్డెక్స్ ఛాలెంజర్ ట్రోఫీ పోటీల్లో భారతజట్టు దివిజ్‌శరణ్– పూరవ్‌రాజా 2017 తొలి టైటిల్‌ను సాధించారు. ఫ్రాన్స్‌లోని బార్డెక్స్‌లో నిన్న జరిగిన పోటీలో ఈ జోడీ మెక్సికన్–కిలీ జోడీని 6–4, 6–4 స్కోరుతో ఓడించి టైటిల్‌ను కైవసం చేసుకుంది.

-------------

అస్సాంలో నిషేధిత ఎన్‌డీఎఫ్‌బీ సంస్థకు చెందిన డిప్యూటీ కమాండర్ ఇన్ ఛీఫ్‌ను మానస్ జాతీయ పార్కు వద్ద భద్రతా దళాలు కాల్చి చంపాయి. సంఘటన జరిగిన ప్రదేశం చిరాంగ్ జిల్లా పరిధిలో ఉంది. భద్రతా దళాలు–అతడి నుండి ఆయుధాలు, పేలుడు సామాగ్రి స్వాధీనం చేసుకున్నాయి.

------------